క్లుప్తంగా

రహదారుల నిర్మాణంలో జాగ్రత్తలు తీసుకోండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: చినరావూరుపార్కు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. తెనాలి పట్టణంలో అనేక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలిఅర్బన్: ఖాశీమాత దేవస్థాన కమిటీ సభ్యులు గుణశేఖర్, వెంకటరమణ, భార్గవి, కోదండ నాగవర్ధన్‌ల సహకారంతో శివాజీచౌక్‌లోని దేవస్థానం వద్ద శుక్రవారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ గుమ్మడి రమేష్ మాట్లాడుతూ ప్రతి నెల 2వ శుక్రవారం దేవస్థానం వద్ద అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కందేపి సీతారామయ్య, యర్రా శ్రీనివాసరావు, నక్కా వెంకటేశ్వర్లు, గవిని దినేష్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రత్యేక సదరం క్యాంప్

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో జరుగుతున్న ప్రత్యేక సదరం క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరిగిన క్యాంప్‌లో ఈఎన్‌టీ, అప్తామాలజీ, సైక్రాటిక్, ఆర్థోపెడిక్ విభాగ వికలాంగులకు పరీక్షలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఈఎన్‌టీ, అప్తామాలజీ, సైక్రాటిక్ విభాగాలకు చెందిన ప్రభుత్వ వైద్యులు సేవలు అందించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి క్యాంప్‌ను పర్యవేక్షించారు.

ముగిసిన శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

తెనాలి: పట్టణ షరాఫ్‌బజారులోని శ్రీసువర్చల సమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజున ఉదయం పుష్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అలంకరించారు. విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద సంతర్పణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి నేతృత్వంలో అర్చకులు ఉత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. అనువంశిక ధర్మకర్త ఎస్‌బీ శివ, నిఖిల్ శాండిల్య, శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్ సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ, జంధ్యం రామారావు, మదుపల్లి చంద్రశేఖర్, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సభ్యులు పాల్గొన్నారు.

ఆరు ఇసుక ట్రాక్టర్లు సీజ్

కొల్లిపర: ఎటువంటి అనుమతులు లేకుండా కృష్ణా నదిలో ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను దావులూరు అడ్డరోడ్డు వద్ద శుక్రవారం ఉదయం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రీ ఇసుక విధానం మండలంలోని కృష్ణా నదికి ఆనుకుని ఉన్న వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, కొల్లిపర, హనుమాన్‌పాలెం, అన్నవరం గ్రామాలకు మాత్రమే అనుమతి ఉన్నదన్నారు. మిగిలి ఏ గ్రామానికైనా ఇసుక తరలించాలి అంటే తప్పనిసరిగా అనుమతులు ఉండాలని, ఎటువంటి అనుమతులు, వే బిల్లు లేకుండా ఇసుక తరలిస్తే అటువంటి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. సీజ్ చేసిన ఆరు ట్రాక్టర్లను స్థానిక తహసీల్దారు సిద్ధార్థకు అప్పగించగా వాటికి ఆయన వాటికి రూ.10 వేలు చొప్పున ఫైన్ వేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

తెనాలి రూరల్: రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు గాయాలపాలైన ఘటన మండలంలోని ఖాజీ పేట వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. వినోద్ తన బార్య దుర్గాభవాని తో కలసి నందివెలుగు వైపు నుండి బైక్ పై వెళుతుండగా ఖాజీపేట వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో గాయాలపాలయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ ప్రతాప్ కుమార్ తెలిపారు.

హత్య కేసుగా మార్పు

తెనాలి రూరల్: మద్యానికి డబ్బులివ్వలేదని వ్యక్తి పై హత్యాయత్నం చేయగా బాధితుడు మృతి చెందడంతో హత్య కేసుగా పోలీసులు మార్చారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ నాజరుపేటకు చెందిన బసవయ్య అద్దెకు ఆటోలను తిప్పుతుంటాడు. ఇతని వద్ద అంగలకుదురుకు చెందిన అనిల్ ఆటోలు అద్దెకు తీసుకుంటుంటాడు. అనిల్‌తో పాటు ఇస్లాంపేటకు చెందిన జుపల్లి వేణు, అతని స్నేహితుడు రాము గత నెల 31వ తేదీ రాత్రి మద్యం తాగడానికి బసవయ్యను డబ్బు అడుగగా అతను ఇచ్చేందుకు నిరాకరించాడు. తమ వద్ద ఉన్న కత్తితో అతని గొంతుపై పొడిచారు. బాధితుడు చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. బసవయ్య శుక్రవారం మృతి చెందడంతో హత్య కేసుగా మార్చారు.

జాడేలేని ట్రాఫిక్ అడ్వయిజరీ కమిటీ

- ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు కమిటీ ఏర్పాటు
- పట్టణంలో రోజు రోజుకీ జటిలమవుతున్న ట్రాఫిక్ సమస్య



గాంధీచౌక్ కూడలిలో ట్రాఫిక్ రద్దీ(ఫైల్)

తెనాలిరూరల్: పట్టణంలోని ప్రధాన సమస్యల్లో ఒకటైన ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి రదీని తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ అడ్వయిజరీ కమిటీ జాడే లేకుండా పోయింది. కమిటీని ఏర్పాటు చేసి 15 ఏళ్లు దాటినా ఇటీవలి కాలంలో సమావేశమైన దాఖలాలు లేవు.

పశ్చిమ డెల్టాలో ప్రధాన పట్టణమైన తెనాలికి పరిసర గ్రామాల ప్రజల రాకపోకలు అనునిత్యం జరుగుతూనే ఉంటాయి. రోజు రోజుకీ పెరుగుతున్న వాహనాల వినియోగంతో తెనాలిలో ట్రాఫిక్ కష్టాలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. గతంలో మార్కెట్ వంతెన వద్ద స్కైవాక్ బ్రిడ్జి నిర్మాణం కోసం అధికారులు మూడు రోజులు పాటు చేపట్టిన సర్వేలో మార్కెట్ వంతెన వద్ద తెనాలి- గుంటూరు రోడ్డు, తెనాలి-చందోలు రహదారిలో గంటకు 1400 నుంచి 1600 మంది పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారని తేలింది. ఇప్పుడు ఈ సంఖ్య 2000కు చేరి ఉంటుందని అంచనా. ఇక వాహనదారుల సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దీని వలన పట్టణంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుంది. అధిక జనసాంద్రత కలిగి ఉన్న పట్టణం దానికి తోడు పరిసర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలతో రోడ్లు కిటకిటలాడుతూనే ఉంటాయి. ఇరుకు రోడ్లు కావడం ట్రాఫిక్ సమస్యను మరింత జటిలంగా మారుస్తోంది.

ఈ సమస్యను పరిష్కరించడంతో పాటు ట్రాఫిక్ కష్టాల నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో ఆర్డీవో/సబ్‌కలెక్టర్ అధ్యక్షతన మున్సిపల్, రెవెన్యూ, రవాణా శాఖ, ఆర్టీసీ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇతర శాఖల అధికారులు సభ్యులుగా ట్రాఫిక్ అడ్వయిజరీ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సిఫార్సుల మేరకు పాత రత్నా టాకీస్ వరకు వచ్చే మంగళగిరి బస్సులను చినరావూరు పార్కు వరకే పరిమితం చేశారు. కొన్ని రోడ్ల విస్తరణకు సూచనలు చేసింది. ఇక అంతే సుమారు దశాబ్ద కాలంగా అడ్వయిజరీ కమిటీ ఊసే లేకుండా పోయింది. మరో వైపు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పెరుగుతూనే ఉంటోంది. గతంలో నాదెండ్ల మనోహర్ సభాపతిగా ఉన్న సమయంలోనే అడ్వయిజరీ కమిటీ ఏర్పాటు జరిగింది. తదనంతర ప్రభుత్వాల్లో కమిటీ ప్రాధాన్యత లేకుండా పోయింది. తెనాలి శాసనసభ్యుడు, రాష్ట్ర మంత్రిగా ప్రస్తుతం ఆయనే ఉండడంతో ఈ కమిటీని తిరిగి సమావేశపరచి పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారేమో చూడాలి.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రజా సూచనల్లో కొన్ని..

ట్రాఫిక్ సమస్య పరష్కారానికి ప్రజలు పలు సూచనలు చేస్తున్నారు. వాటిలో ప్రధానంగా పెరుగుతున్న జనాభా, వాహనాల వినియోగంకు తగ్గట్టు రోడ్ల విస్తరణ చేపట్టాలి. అది జరుగకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తప్పడంలేదు. మంగళగిరి నుంచి చినరావూరు పార్కు వరకు వచ్చే ఆర్టీసీ బస్సులు, వివిధ విద్యా సంస్థల బస్సులు కొత్త వంతెన వద్ద మలుపు తిరిగే సమయంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రోడ్ల విస్తరణతో పాటు కొత్త వంతెనను విస్తరించడం లేదా సమాంతరంగా మరో వంతెనను నిర్మిస్తే కొంత వరకు వాహనదారుల ఇబ్బందులు తీరతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి

తెనాలి సబ్‌కలెక్టర్ సంజన సింహా



ఉద్యోగులతో ప్రమాణం చేయిస్తున్న సబ్‌కలెక్టర్ సంజన సింహా

తెనాలిఅర్బన్: గ్రాడ్యుయేషన్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా పేర్కొన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ గ్రాడ్యుయేషన్ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. పోటీల్లో ఉన్న అభ్యర్థులు ఇప్పటికే నామినేషన్లు వేయడం జరిగిందన్నారు. ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన పోలింగ్ కేంద్రాలను కూడా సిద్ధం చేసినట్లు చెప్పారు. 27వ తేదీన పోలింగ్ జరగనున్నట్లు వివరించారు. ఎన్నికల విధులకు హాజరయ్యేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే ఎన్నికలు జరిగే కృష్ణా-గుంటూరు జిల్లాల్లో పోటీ చేసే అభ్యర్థులపై ఎన్నికల కమిషన్ నిఘా ఏర్పాటు చేసిందన్నారు. స్క్వాడ్ విధులను నిర్వహించే వారు ఎప్పటికప్పుడు అన్ని విషయాలను అధికారులకు తెలియజేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, తహసీల్దార్ గోపాలకృష్ణ, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సంజీవరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

ఫ్రైడేను డ్రైడేగా పాటించండి



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ మహిత

తెనాలిఅర్బన్: ఫ్రైడేన్ డ్రైడేగా పాటించాలని సుల్తానాబాద్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ యు.మహిత సూచించారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో దోమల నియంత్రణపై శుక్రవారం చెంచుపేట, ఇందిరానగర్‌కాలనీ, యడ్ల లింగయ్య కాలనీలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల నియంత్రణకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. దోమల వ్యాప్తి పెరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని వివరించారు. ప్రతి శుక్రవారం ఇంటి ఆవరణలో ఉన్న పాత వస్తువులను శుభ్రం చేయాలని సూచించారు. సహాయ మలేరియా అధికారి వంగాల పున్నారెడ్డి మాట్లాడుతూ ప్రజల జీవన మనుగడకు దోమలు అవరోధాలుగా మారుతున్నాయని తెలిపారు. నీటి ద్వారా దోమల ఉత్పత్తి పెరుగుతుందని చెప్పారు. సబ్ యూనిట్ మలేరియా అధికారి అండె బాలచంద్రమౌళి మాట్లాడుతూ దోమకాటు వలన విషజ్వరాలు, డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బండారు మల్లేశ్వరరావు, దీపాల శ్రీనివాసరావు, షేక్ రషీద్, ఎ.వేణుగోపాల్, షేక్ కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా కిషోర్‌రెడ్డి



అధ్యక్షులు, గౌరవాధ్యక్షులు, సభ్యుల జాబితాను ప్రకటిస్తున్న సహదేవరెడ్డి

తూములూరు(కొల్లిపర): భారతీయ కిసాన్ సంఘ్ గుంటూరు జిల్లా కమిటీ ఎన్నికల్లో జిల్లా కమిటీ అధ్యక్షుడుగా కొల్లిపర మండలంలోని తూములూరు గ్రామానికి చెందిన కొండా కిషోర్‌రెడ్డిని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు సహదేవరెడ్డి తెలిపారు.శుక్రవారం తూములూరు గ్రామంలోని గంగానమ్మ గుడి ఆవరణలో దుగ్గిరాల, తాడేపల్లి, మంగళగిరి, తెనాలి, కొల్లిపర ఆయా మండలంలోని కిసాన్ సంఘ్ సభ్యులు పాల్గొని జిల్లా కమిటీ ఎన్నిక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం పాటు పడుతున్న సంస్థ భారతీయ కిసాన్ సంఘ్ అని అన్నారు. రైతులు సంఘటితంగా ఉండి తమ సమస్యలపై పోరాడితేనే వాటికి వెంటనే పరిష్కారం లభిస్తుందనారు. ఎక్కువ శాతం సాగునీటి కాలువలు, పంటకాలువలు, డ్రైయినేజీ కాలువలు సరిగా లేనందున పంటలకు సరైన నీరు అందక, వరదలు సమయంలో వరద నీరు బయటకు పోవటానికి సరైన మార్గం లేక పోవటం వలన రైతులు ఎనలేని నష్టం జరుగుతుంది కావున భారతీయ కిసాన్ సంఘ్ తరుపున రాష్ట్ర కమిటీని నియమించి వారి ద్వారా రైతుల అభిప్రాయాలతో కలపి ఒక నివేదిక తయారు చేసి త్వరలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం జిల్లా కమిటీలో ఎన్నికైన అధ్యక్షులుగా కిషోర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా భీమిరెడ్డి రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కుర్రే బ్రహ్మారెడ్డి, కార్యదర్శిగా బొమ్ము వెంకటేశ్వరరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులుగా కుర్రే సుధాకర్‌రెడ్డి, కోశాధికారిగా భీమవరపు బ్రహ్మానంద రెడ్డిలను నియమించినట్లు ప్రకటించి వారిని అభినందించారు. భారతీయ కిసాన్ సంఘ్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు జి.రాంబాబు, రాష్ట్ర సంఘటనా కార్యదర్శి కొండబాబు, ఆశాకిరణ్, వంగా సాంబిరెడ్డి, వింతా వేణుగోపాలరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పిల్లలకు పోషకాహారం అందించాలి



పోషణ్‌భీ-పఢాయి భీ కార్యక్రమం గురించి వివరిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు

కొల్లిపర: తల్లిదండ్రులు తమ పిల్లలకు సరైన పోషకాహారం అందించినప్పుడే పిల్లలు ఎదుగుదలల్లో ఎటువంటి లోపాలు లేకుండా ఆరోగ్య వంతులుగా ఎదుగుతారని తూములూరు సెక్టార్ సూపర్‌వైజర్ టి.రాధిక అన్నారు. శుక్రవారం కొల్లిపర హైస్కూల్ ఆవరణలో పోషణ్‌భీ-పఢాయి భీ కార్యక్రమంపై అంగన్వాడీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ 1000 రోజుల సంరక్షణ కార్యక్రమాలు, పిల్లల్లో లోప పోషణ ఎస్‌ఎఎం, ఎంఎఎం గురించి వివరించారు. కొల్లిపర సెక్టార్ సూపర్‌వైజర్ కె.యామిని మాట్లాడుతూ 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు పోషకాహారం సమతుల్య ఆహారం, పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రుల ప్రాముఖ్యతను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాలకు విద్యుత్ కోత

కొల్లిపర: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్‌శాఖ ఏఈ ప్రదీప్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నవరం విద్యుత్ ఫీడర్ పరిధిలో అన్నవరం, అన్నవరం గొడపాలెం, హనుమాన్‌పాలెం, బొమ్మువానిపాలెం, తూములూరు, దావులూరిపాలెం, దావులూరు విద్యుత్ ఫీడర్ పరిధిలో జెముడుబాడు, జెముడుబాడుపాలెం, దావులూరు ఆయా గ్రామాలలో విద్యుత్ కోత నిర్వహించనున్నట్లు తెలిపారు.

బర్డ్ ఫ్లూ వ్యాధిపై అపోహలు వద్దు

పశుసంవర్థకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగిరెడ్డి

తెనాలిటౌన్: బర్డ్ ఫ్లూ వ్యాధిపై ఎటువంటి అపోహలు వద్దని పశువర్ధకశాఖ తెనాలి అసిస్టెంట్ డైరెక్టర్ నాగిరెడ్డి ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ వ్యాధి గురించి ప్రజలు వివిధ రకాల ఆందోళనకు గురవుతున్నట్లు తెలియజేశారు. కొన్ని జిల్లాల్లో వైరస్ లక్షణాలు గుర్తించి ప్రభుత్వం ప్రణాళికతో వైరస్‌ను అదుపు చేస్తున్నట్లు చెప్పారు. బ్రాయిలర్, నాటుకోళ్ళ ద్వారా పౌల్ట్రీలో పనిచేసే వారికి ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. మనిషి నుంచి మనిషికి బర్డ్ ఫ్లూ సోకదని తెలిపారు. మనుషులకు అంత్యత అరుదుగా బర్డ్ ఫ్లూ వస్తుందని సూచించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎవరికి ఈ వ్యాధి సోకలేదని స్పష్టం చేశారు. పౌల్ట్రీ ఉత్పత్తులను బాగా ఉడికించి ఆహారంగా తీసుకోవాలని వెల్లడించారు. వ్యాధి బారినపడిన కోళ్లు, జంతువులకు దూరంగా ఉండాలని తెలియజేశారు.

సమ్మోహితులను చేసే వాయులీన ప్రతిభ

యల్లమందరాజు సంస్మరణోత్సవంలో వక్తలు



తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ వయొలిన్ విద్వాంసుడు కూరపాటి యల్లమందరాజు తన వాయులీనంతో సంగీతాభిమానులను సమ్మోహితులను చేసేవారని, అంతటి వైదుష్యం అరుదైనదని పలువురు పట్టణ కళారంగ ప్రముఖులు స్మరించుకున్నారు. యల్లమందరాజు సంస్మరణోత్సవాన్ని శుక్రవారం రాత్రి ఇక్కడి నెహ్రూరోడ్డులోని శ్రీగోవర్ధన స్వామి ఆలయ ప్రాంగణంలో వైభవంగా నిర్వహించారు. సభకు కూరపాటి సీతారామరాజు అధ్యక్షత వహించారు. గౌరవ అతిథి నగధరరావు, ఆత్మీయ అతిథి కూరపాటి కొండంరాజు తమ ప్రసంగాల్లో యల్లమందరాజుతో తమకు గల జ్ఞాపకాలను స్మరించుకున్నారు. ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ ములుకుట్ల బ్రహ్మానందశాస్త్రి, శివపార్వతి, సరికొండ సత్యనారాయణరాజు, మృదంగ విద్వాన్ సాయిబాబాలు యల్లమందరాజు వాయులీన ప్రతిభను సోదాహరణంగా చెప్పారు. కల్మషం లేకుండా ముక్కుసూటిగా వ్యవహరించేవారని గుర్తుచేసుకున్నారు. సభానంతరం హరికథా కౌముది ధూళిపాళ శివరామకృష్ణ చేసిన హరికథాగానం భక్తులను ఆనందింపజేసింది. మృదంగంపై కానూరు వెంకట రామకృష్ణ, వయొలిన్‌పై ధూళిపాళ శ్రీనివాస్ వాయిద్య సహకారం అందించారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులకు సూచనలు చేస్తున్న శాంత కుమారి

కొల్లిపర: రానున్న పదోవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెనాలి డిప్యూటీ డీవో జి.శాంత కుమారి సూచించారు. శుక్రవారం కొల్లిపర హైస్కూల్ లో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ క్లాస్, న్యూట్రిషన్ ఫుడ్ అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు ఎటువంటి ఆందోళనలు పెట్టుకోకుండా ధైర్యంగా పబ్లిక్ పరీక్షలు రాయాలని, ప్రశ్నా పత్రం అందించిన వెంటనే విద్యార్థులు ఒకసారి ప్రశాంతంగా ప్రశ్నలు పరిశీలించి ముందుగా వారికి బాగా వచ్చిన ప్రశ్నలకు జవాబులు వ్రాసి న తరువాత మిగిలిన ప్రశ్నలు మళ్లీ చదివి గుర్తు ఉన్న వరకు మాత్రమే ఎటువంటి తప్పులు లేకుండా వాటికి జవాబులు రాయాలని తెలిపారు.

ఫార్మసిస్టులుగా రాణించటం సవాలే



డాక్టర్ విలియంకేరిని సత్కరించిన మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: మారుతున్న సమాజంలో ఫార్మసిస్టులుగా రాణించడం సవాలుతో కూడుకున్నదనీ, నిరంతరం అధ్యయనంతో వినూత్న ఆలోచనలను ఆచరణలోకి తెస్తూ కష్టపడి పనిచేస్తే సత్ఫలితాలు వస్తాయని ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.విలియం కేరి అన్నారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్‌ఎన్ ఫార్మసీ కళాశాలలో ఫార్మా-డి విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ విలియం కేరి మాట్లాడుతూ ఫార్మసిస్టులుగా రాణించడానికి చేయాల్సిన కృషినీ, ఉపాధి అవకాశాలను వివరించారు. ఏఎస్‌ఎన్ విద్యా సంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు తమ అనుభవాలనూ, తాము నేర్చిన విద్యాంశాలను జూనియర్లతో పంచుకోవడం మంచి సంప్రదాయమన్నారు.

అలాగే సీనియర్ల నుంచి మంచి అనుభవాలను తెలుసుకోవటం అనేది మంచి అలవాటుగా చెప్పారు. పాఠ్యాంశాలతోపాటు ఇతరుల నుంచి తెలుసుకున్న అంశాలకు, సృజనను జోడించి, కొత్త ఆవిష్కరణలకు దోహదపడితే విజయం సాధించవచ్చని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకట రమణ మాట్లాడుతూ సమాజంలోని రుగ్మతలకు దూరంగా పలువురికి ఆదర్శ విలువలతో కూడిన జీవనవిధానం సాగించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఫార్మా-డి విద్యార్థులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయండి

మెప్మా విభాగ మేనేజింగ్ డైరెక్టర్ భరద్వాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కమిషనర్ శేషన్న, మెప్మా సీఎంఎం విజయ కుమారి

తెనాలిఅర్బన్: స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని మెప్మా విభాగ మేనేజింగ్ డైరెక్టర్ భరద్వాజ్ సూచించారు. తెనాలి మున్సిపల్ అధికారులతో శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెప్మా విభాగంలో అనేక కొత్త ప్రాజెక్టులను అమలు చేస్తున్నట్లు చెప్పారు. వాటన్నింటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, మెప్మా సీఎంఎం విజయ కుమారి, మెప్మా ఉద్యోగులు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

సమస్య లేకుండా భూ-రీసర్వే నిర్వహించాలి

తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజన సింహా



కుంచవరంలో భూ రీసర్వే ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ వి.సంజన సింహా

కుంచవరం(కొల్లిపర): అధికారులు భూ-రీసర్వే నిర్వహించే సమయంలో గ్రామంలో రైతులకు ఎటువంటి సమస్యలు లేకుండా సర్వే నిర్వహించాలని, సర్వే సమయంలో సమస్యలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజన సింహా అన్నారు. మండల పరిధిలోని కుంచవరం గ్రామంలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూ రీ సర్వే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. సర్వే ఏవిధంగా జరుగుతోంది, సర్వే సమయంలో ఆ భూమి యజమానులకు అధికారులకు ముందుగానే సమాచారం అందిస్తున్నారా, లేదా? వెబ్ లాండ్‌లో రైతులు తమ భూములు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ఉన్నారా, ఇంకా నమోదు చేసుకోకుండా ఎవరైన ఉన్నారా అని గ్రామంలోని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ భూ రీ సర్వే అనంతరం సర్వే లో ఎవరికైనా ఎటువంటి సమస్యలు ఉన్నా సమస్యలపై వినతపత్రాలు స్వీకరించి, పరిష్కరించడానికి ప్రభుత్వం 190 రోజులు కాలపరిమితి ఉన్నందున సదరు వ్యక్తులకు నోటీలు అందించి తగు అర్జీలు పరిష్కరించవచ్చునన్నారు. గ్రౌండ్ వ్యాలిడేషన్ జరిగే సమయంలో గ్రామంలో ముందుగా గ్రామ సభలు నిర్వహించి రైతులకు సంబంధించిన భూ వివరాలు తెలిపి, వారి సమక్షంలోనే తప్పులు ఉంటే సరిచేయటం జరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ప్రభుత్వ భూముల రీ సర్వే గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు ఉప్పాల రాజేష్, మండల సర్వేయర్ బి. శ్రీనివాసరావు, వీఆర్‌వో జానీ భాషా, సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి నేడు తెనాలి రాక

శోభాయాత్రకు ఏర్పాట్లు



వివరాలు వెల్లడిస్తున్న మఠం బాధ్యులు

తెనాలి: ఆర్యవైశ్య కులదేవత శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మస్థలమైన పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలోని అఖిలభారత శ్రీవాసవీ పెనుగొండ క్షేత్రానికి పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) ఈనెల 15వ తేదీన తొలిసారిగా తన స్వస్థలమైన తెనాలి రానున్నారు. పెనుగొండ క్షేత్ర వాసవీ శాంతిధామంలో ఈనెల 8వ తేదీన భీష్మ ఏకాదశి రోజున బాల స్వామీజీ పీఠాధిరోహణ చేసిన విషయం తెలిసిందే. అనంతరం పీఠాధిపతి హోదాలో తన ఆధ్యాత్మిక జీవితం ప్రారంభమైన తెనాలిలోని శ్రీవిద్యాపీఠంకు రానున్నారు.

సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీవిద్యా పీఠంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ట్రస్ట్ కార్యదర్శి వివరాలను తెలియజేశారు. 15వ తేదీ సాయంత్రం 4.35 గంటలకు తెనాలి సరిహద్దుల్లో గల శ్రీవరసిద్ధి వినాయక స్వామి విగ్రహం వద్దకు స్వామీజీ చేరుకుంటారు. అక్కడి నుంచి స్వామివారి శోభాయాత్రను ప్రారంభించి, మార్కెట్ మీదుగా గాంధీచౌక్, గ్రంథాలయం రోడ్డులోంచి గంగానమ్మ పేటలోని శ్రీవిద్యాపీఠం చేరుకుంటారని తెలిపారు. సంయుక్త కార్యదర్శి ముద్దా భక్తుని రమణయ్య మాట్లాడుతూ శోభాయాత్రలో సంప్రదాయ మంగళవాయిద్యాలు, కేరళ కళాకారులచే డప్పులతో సహా 500 మహిళల కోలాటం శోభాయాత్రలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం శ్రీవిద్యాపీఠంలో స్వామీజీ అనుగ్రహభాషణ చేస్తారని, భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. సమావేశంలో కోశాధికారి గోపు రామకృష్ణ, కమిటీ సభ్యులు రాజేశ్వరరావు, పెనుగొండ వెంకటేశ్వరరావు, కోన నాగేశ్వరరావు, లోకనాథం పాల్గొన్నారు.

పిల్లల ఎత్తు -బరువు-పెరుగుదలలో వ్యత్యాసాన్ని గుర్తించాలి

ఐసీడీఎస్ తెనాలి ప్రాజెక్టు సీడీపీవో సునీత



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో కె.సునీత

తెనాలిటౌన్: అంగన్‌వాడీ పిల్లల ఎత్తు- బరువు-పెరుగుదలలో వ్యత్యాసాన్ని గుర్తించాలని ఐసీడీఎస్ తెనాలి ప్రాజెక్టు సీడీపీవో కె.సునీత పేర్కొన్నారు. పోషణ్ భీ పడాయి భీ శిక్షణ కార్యక్రమంలో భాగంగా స్థానిక కొత్తపేటలోని మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి ఐసీడీఎస్ సీడీపీవో డాక్టర్ కె.సునీత పాల్గొని అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రెండోవ రోజు అంగన్‌వాడీ చిన్నారులు ఎత్తు, బరువు, పెరుగుదలపై వ్యత్యాసాన్ని గుర్తించాలని, అవసరమైన పోషణపై దృష్టిసారించాలని తెలియజేశారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలకు ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ కనపరిచేలా తల్లిదండ్రులకు కలిపించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు హిమబిందు, నాగమణి, వెంకటలక్ష్మి, రాధిక, యానాదమ్మ, వెంకటరమణ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.